నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, గురువారం 15 మే 2025 | MAHABUBNAGAR NARAYANPET

- స్కోర్ ప్రామాణికంగానే బ్యాంకు రుణాలు
- నిరాశకు గురవుతున్న నిరుద్యోగ యువత
- క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన షురూ..

# యువ వికాసానికి మొకాలడ్డు

- దరఖాస్తుదారులకు సిబిల్ స్కోర్ గండం

కోడేరు, మే 14 : రాజీవ్ యువ వికాసానికి ఆదిలోనే ప్రభుత్వం మొకాలడ్డుతున్నది. యువతకు ఎలాంటి షరతులు లేకుండా రుణం ఇస్తున్నామని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం బ్యాంకులు లబ్ధిదారుల ఎంపికలో సిబిల్ స్కోరు తప్పనిసరిగా ఉండాలనే నిబంధనలు పెట్టడంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. గతంలో రుణాలు తీసుకొని ఎగ్గొట్టిన వారికి పూర్తి సబ్సిడీ లేని రుణాలు ఇవ్వడం కష్టమేనని తెలుస్తోంది. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది. గతనెలలోనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు తుదిగడువు ముగిసింది. ఎవరైతే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి అన్నిరకాల పత్రాలను సమర్పించిన వారి దరఖాస్తుల పరిశీలన ప్రారంభమైంది. వీటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలుగా విభజించి దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన పూర్తయిన తర్వాతనే ఆయా సంక్షేమ శాఖలకు దరఖాస్తులను పంపించనున్నారు. బ్యాంకుల ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుంది. ఇక్కడ రూ.2నుంచి4లక్షల వరకు రుణాలు తీసుకునే వారికి సిబిల్ స్కోరు ఆధారంగానే బ్యాంకులు రుణాలను మంజూరు చేయనున్నాయి.

**రూ.2లక్షలు కావాలంటే..**

రాజీవ్ యువ వికాసంలో రూ.50వేల నుంచి 4లక్షల వరకు రుణాలను ఇవ్వనున్నారు. యువత పొందే రుణాల ఆధారంగానే బ్యాంకు సబ్సిడీ రుణాలను ఇస్తారు. బ్యాంకు రుణాల విషయంలో లబ్ధిదారుడి సిబిల్ స్కోరు ప్రామాణికంగా తీసుకోనున్నారు. వీటిలో రూ.50వేల రుణానికి వందశాతం సబ్సిడీ ఉంది. దీనికి ఏవిధమైన బ్యాంకు రుణం, సిబిల్ స్కోర్ అవసరం ఉండదు. రూ.లక్ష రుణానికి 90 శాతం సబ్సిడీ ఉంటుంది. 10శాతం మాత్రమే బ్యాంకు రుణం. దీనికి సైతం సిబిల్‌స్కోరు అవసరం లేదు. రూ.2లక్షల రుణానికి 80శాతం సబ్సిడీ ఉంటుంది. 20శాతం బ్యాంకు రుణం పొందాల్సి ఉంటుంది. ఇక్కడ సిబిల్‌స్కోర్ అవసరం ఉంటుంది. రూ.4లక్షల రుణానికి 70శాతం సబ్సిడీ ఉంటుంది. మిగతా 30 శాతం బ్యాంకు రుణం ఉంటే.. సిబిల్ స్కోరు అవసరమని అధికారులు పేర్కొంటున్నారు.

**మహిళలకు పెద్దపీట**

ఈ పథకంలో మహిళలకు పెద్దపీట వేయనున్నారు. వితంతువులు, ఒంటరి మహిళలకు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. ఆ తర్వాత నిరుపేద మహిళలకు ప్రాధాన్యం దక్కుతుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ వారీగా గుర్తించి ఆయా సంక్షేమ శాఖలు లబ్ధిదారులను ఎంపిక చేస్తాయి.

కోడేరులో ఇటీవల ఆర్‌వైవీ పథకం దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

- పిల్లలమర్రి వద్ద సందడి చేయనున్న భామలు
- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన అధికారులు
- వెయ్యి మంది పోలీసులతో మూడంచెల భద్రత
- పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు



పిల్లలమర్రి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

# అందానికి ఆతిథ్యం

**రేపు పాలమూరుకు ప్రపంచ సుందరీమణులు**

మహబూబ్‌నగర్, మే 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పర్యాటక జిల్లా పాలమూరులో వివిధ దేశాల సుందరీ మణులు సందడి చేయనున్నారు. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పిల్లలమర్రికి ప్రపంచ సుందరీమణులు వస్తుండడంతో పాలమూరుకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. దాదాపు 750 ఏండ్లకుపైగా పురాతనమైన పిల్లలమర్రికి అంతర్జాతీయ ఖ్యాతి లభించినట్లయ్యింది. 10 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న 72వ మిస్ వరల్డ్ పోటీలకు రాజధాని హైదరాబాద్ వేదికగా మారింది. ఈ పోటీల్లో పాల్గొనే వివిధ దేశాలకు చెందిన 22 మంది సుందరీమణులు 16వ తేదీన మహబూబ్‌నగర్ సమీపంలోని పిల్లలమర్రి పర్యాటక ప్రాంతాన్ని సందర్శించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రసిద్ధ మహా వృక్షం వద్దకు రానున్నారు. పిల్లలమర్రితోపాటు అక్కడే ఉన్న పురావస్తు మ్యూజియం, రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని వారు సందర్శించనున్నారు. వీరికి స్వాగత ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందుకోసం పోలీస్, రెవెన్యూ యంత్రాంగం భద్రతా ఏర్పాట్లల్లో నిమగ్నమైంది. అత్యంత భారీ భద్రత మధ్య వీరి పర్యటన కొనసాగనున్నది. ఇప్పటికే కలెక్టర్ విజయేందిరబోయి నేతృత్వంలో అధికారులు ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. భద్రతా చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పిల్లలమర్రి ప్రాంతాన్ని పోలీసులు వారి ఆధీనంలోకి తీసుకున్నారు. ఎలాంటి అవరోధాలు లేకుండా ఊడల మర్రిని చూపించి మరపురాని ఆతిథ్యం ఇవ్వన్నట్లు కలెక్టర్ ప్రకటించారు. అతిథులకు అన్ని ఏర్పాట్లు దగ్గరుండి పూర్తి చేయనున్నారు. రెండ్రోజుల నుంచి సందర్శకులను పిల్లలమర్రిలోకి అనుమతించడం లేదు. కాగా ఉమ్మడి జిల్లా ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కానీ ప్రజలకు, సందర్శకులకు ఎలాంటి అనుమతిని లేదని అధికారులు చెబుతున్నారు.

**భారీ బందోబస్తు**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని పిల్లలమర్రి పర్యాటక ప్రాంతాన్ని అందాల భామలు సందర్శించనుండడంతో మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ నేతృత్వంలో బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. భద్రతా ఏర్పాట్లపై దగ్గరుండి సమీక్షిస్తున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని మూడు స్థాయిల భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. సుమారు వెయ్యి మంది పోలీసులు నియమించినట్లు చెప్పారు. హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వరకు ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తకుండా పోలీసులు జాతీయ రహదారి-44ను నాకాబంది చేపట్టనున్నారు. పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ విజయేందిరబోయి సంబంధిత అధికారులతో కలిసి సమిష్టిగా పర్యవేక్షిస్తున్నారు. పటిష్ట భద్రతతోపాటు పారిశుధ్య నిర్వహణ, పార్కింగ్, సౌండ్ అండ్ లైటింగ్ ఏర్పాట్ల బాధ్యతను ఆయా శాఖాధికారులకు అప్పగించామన్నారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ జానకి తెలిపారు. పాలమూరులోకి ఎంట్రీ కాగానే ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా నేరుగా వారిని పిల్లలమర్రి వద్దకు తీసుకెళ్లేందుకు బందోబస్తు పూర్తి చేశాం. 3 గంటలు సాగే ఈ పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. సందర్శకులకు అనుమతి లేదని సూచించారు.

**పిల్లలమర్రికి సుందరీమణుల శోభ**

పాలమూరులోని పిల్లలమర్రి పర్యాటక క్షేత్రానికి అందమైన భామల రాకతో మరింత వన్నె రానున్నది. పిల్లలమర్రి జవసత్వాలు కోల్పోతుంటే కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అధికార యంత్రాంగం దగ్గరుండి పునర్జీవ చర్యలు చేపట్టింది. నాడు సందర్శకులు చెట్టు ఊడలకు నష్టం కలిగించేలా వ్యవహరించడం.. సమీపంలోని ఓ ప్రార్థన స్థలం నుంచి వస్తున్న పొగతో మహావృక్షానికి ప్రమాదం దాపురించింది. పర్యాటకశాఖ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఎండిపోయే దశకు చేరింది. అప్పటి కలెక్టర్ రొనాల్డ్ రోస్ దగ్గరుండి ఈ వృక్షానికి.. మనిషికి ఎలా అయితే సెలైన్లు ఎక్కిస్తారో.. అలాగే ఈ మర్రికి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. అలాంటి ట్రీట్‌మెంట్‌ను అందించి మహావృక్షం కనుమరుగు కాకుండా చర్యలు చేపట్టింది. ఊడలను.. చెట్ల వేర్లను కాపాడి తిరిగి మహావృక్షాన్ని పచ్చదనంతో నింపేశారు. సుమారు రెండెకరాల స్థలంలో విస్తరించిన ఈ వృక్షానికి సందర్శకులు దగ్గరి నుంచి వీక్షించేందుకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. వృక్ష సంరక్షణ చర్యల్లో భాగంగా సందర్శకుల ఎంట్రీపై నిషేధం విధించారు.

**ప్రపంచ పటంలో పాలమూరు మర్రి**

తెలంగాణలో జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వారిలో 22 మంది సుందరీమణులు పాలమూరు పిల్లలమర్రి పర్యాటక ప్రాంతాన్ని సందర్శించేందుకు ఎంచుకున్నారు. జిల్లా కేంద్రం సమీపంలో ఎంతో ప్రఖ్యాతిగాంచిన ఈ మహావృక్షం చూడాలని కొంతమంది ఉత్సాహం చూపడంతో అధికార యంత్రాంగం వెంటనే ఏర్పాట్లకు ఆదేశించింది. దీంతో అధికారులు ఏర్పాట్లలో మునిగిపోయారు. జిల్లా యంత్రాంగం దగ్గరుండి వారికి పిల్లలమర్రి ప్రాముఖ్యతను వివరించనున్నారు.

## అందాల పోటీల నిర్వహణ సిగ్గుచేటు

- పోటీలపై ఉన్నశ్రద్ధ.. రైతులపై లేదు
- ధాన్యం కోసం నిత్యం రోడ్లెక్కుతున్నారు..
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, మే 14 : రైతులంతా అగచాట్లు పడుతుంటే అందాల పోటీలపై రాష్ట్ర సర్కారు శ్రద్ధ చూపడం సిగ్గుచేటని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్వగృహంలో మాట్లాడుతూ రాష్ట్రంలో వడ్ల కొనుగోలు విషయంలో రైతులు పడుతున్న ఇబ్బందులపై మాజీ మంత్రి ఘాటుగా స్పందించారు. బాధపడే విషయమేమిటంటే రాష్ట్ర సర్కారుకు అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ రైతు సమస్యలపై లేదని.. రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైనా.. కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు అన్నదాతలు అగచాట్లు పడుతున్నారని విమర్శించారు. కొనుగోలు విషయంలో ప్రతిరోజు రైతులు ధర్నాలు చేస్తూ రోడ్డెక్కుతున్నారన్నారు. ఈ ధర్నాలు రాజకీయ పార్టీలు చేసేవి కావని.. రైతులు స్వచ్ఛందంగా రోడ్లమీదికి వచ్చి ధర్నాలు చేస్తున్నారని, ధాన్యం కొంటామన్న సర్కారు ఎందుకు కొనట్లేదని రైతులు ప్రశ్నిస్తున్నారన్నారు. కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి రోజులు తరబడి సమయం పడుతుందన్నారు. కనీసం 10నుంచి 20రోజుల్లో ధాన్యాన్ని కొనేవీలున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం కనబడుస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించడంలో ట్రాన్స్‌పోర్ట్ చాలా కీలకమని, బీఆర్ఎస్ హయాంలో ట్రాన్స్‌పోర్ట్ టెండర్లు పారదర్శకంగా నిర్వహించామన్నారు. వాహనాలు సకాలంలో పంపించకపోతే టెండర్లు రద్దు చేసేవారమని, ట్రాన్స్‌పోర్ట్ టెండర్లు అర్హత లేకున్నా, వాహనాలు లేకున్నా కాంగ్రెస్ కార్యకర్తలకు కట్టబెడ్డడంతోనే ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థ కుప్పకూలిందన్నారు. గన్నీ బ్యాగులు సక్రమంగా సరఫరా చేయక, కిందా మీద పడి మిల్లులకు ధాన్యం తరలిస్తే తరుగు తీస్తున్నారని ఆరోపించారు. ప్రత్యక్షంగా రైతులపై దోపిడీ జరుగుతుందని, వడగండ్ల వర్షం పడి పంట నష్టపోతే పరిహారం లేదా అని ప్రశ్నించారు. అకాల వర్షానికి ధాన్యం తడిసి కొట్టుకుపోతుంటే సర్కారుకు చీమ కుట్టినట్టైనా ఉందా.. దీనికి ఎవరు బాధ్యత వహించాలన్నారు. రైతులు అనేక రకాల ఇబ్బందులు పడుతుంటే ప్రజా ప్రతినిధులు, అధికారులు అందాల పోటీల్లో నిమగ్నమై ఉంటారా.. రైతుల ఇబ్బందులపైనా ఒక్కనాడైనా సమీక్షించి సాంత్వాన కల్పించిన దాఖలాలు లేవన్నారు. హెలికాప్టర్‌లో తిరుగుతున్న మంత్రులు రైతుల దగ్గరికి కారులో కూడా వెళ్లడంలేదని, రైతుల ఇబ్బందులు కనిపించడం లేదా ఇదేం దుర్మార్గం, ఇదేక్కడి అన్యాయమన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి పాపం చేశామని, రైతులు చెంపలు వేసుకుంటున్నారన్నారు. తక్షణమే తడిసిన ధాన్యాన్ని, కొట్టుకుపోయిన ధాన్యానికి పరిహారం కట్టించాలని మాజీ మంత్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రూ.7,375 ధర పలికిన పెసళ్లు

నారాయణపేట టౌన్, మే 14 : నారాయణపేటలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం 32.34 క్వింటాళ్ల పెసళ్లు విక్రయానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.7,375 కనిష్ఠంగా రూ.7,129 ధర పలికాయి. అలాగే 8.33 క్వింటాళ్ల జొన్నలు విక్రయానికి రాగా క్వింటాకు రూ.3,711 ధర లభించింది. 2.94 క్వింటాళ్ల అలసందలు విక్రయానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.5,555, కనిష్ఠంగా రూ. 5,263 ధర పలికాయి. 20.40 క్వింటాళ్ల హంసరకం ధాన్యం విక్రయానికి రాగా క్వింటాకు రూ. 1,837 ధర పలికాయి.

2,286 క్వింటాళ్ల సోనారకం ధాన్యం విక్రయానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ. 2,135, కనిష్ఠంగా రూ.1,605 ధర లభించింది. 34.30 క్వింటాళ్ల ఎర్రకందులు విక్రయానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ. 6,959, కనిష్ఠంగా రూ. 5,055, 3.92 క్వింటాళ్ల తెల్లకందులు విక్రయానికి రాగా క్వింటాకు రూ.6,719 మద్దతు ధర పలికినట్లు మార్కెట్ యార్డు సూపర్ వైజర్ లక్ష్మణ్ తెలిపారు.

# రోడ్డున పడిన చిరువ్యాపారులు

నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారిపై ఆక్రమణలను జేసీబీతో తొలగిస్తున్న అధికారులు

- నాగర్‌కర్నూల్‌లో ఫుట్‌పాత్, సైడ్‌డ్రైన్లపై ఆక్రమణల తొలగింపు
- జేసీబీలతో మున్సిపల్ అధికారుల కూల్చివేత
- పోలీస్ బందోబస్తు మధ్య చర్యలు
- సమాచారం లేదన్న వ్యాపారులు
- వారం కిందటే చెప్పామని అధికారులు

నాగర్‌కర్నూల్, మే 14: నాగర్‌కర్నూల్ పట్టణంలో మున్సిపల్ అధికారులు ఆక్రమణల తొలగింపుకు చర్యలు చేపట్టింది. ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ, ఫుట్‌పాత్‌లు ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తున్న చిరువ్యాపారాలను తొలగించారు. చాలాకాలంగా ప్రధాన రహదారి పొడవునా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు ముందు భాగంలో పండ్లు, టిఫిన్ సెంటర్లు, టీ కొట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను నడుపుకొంటూ చిరువ్యాపారులు జీవనం సాగిస్తున్నారు. అయితే ఆక్రమణలు చేసి వ్యాపారాలు చేస్తున్నారన్న కారణం చూపి బుధవారం వస్తు సామగ్రి ఉండగానే దుకాణాలను జేసీబీతో తొలగించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మున్సిపల్ పరిధిలోని ఉయ్యాలవాడ నుంచి కొల్లాపూర్ చౌరస్తా వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా దుకాణాల ముందు భాగాలు, నల్లవెల్లి రోడ్డులోని ఆక్రమణలు చేసి వ్యాపారం చేస్తున్న వాటిని తొలగించారు. మున్సిపల్ అధికారులు ఇందులో భాగంగా బుధవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు రోడ్డుపై ఇరువైపులా ఆక్రమణలను తొలగించారు. చిరు వ్యాపారులు వస్తు సామగ్రి, పండ్లు, వంటివి ఉండగానే జేసీబీతో తొలగించడంతో వ్యాపారులు మండిపడ్డారు. ఎలాంటి సమాచారం లేకుండా తమ వ్యాపారాలను తొలగించడం ఏంటని ప్రశ్నించారు. అనుమతులు లేకుండా వేశారంటూ రేకుల షెడ్లు, తడకలను పోలీస్ బందోబస్తు మధ్య మున్సిపల్, రెవెన్యూ అధికారులు తొలగించేశారు. ఇదిలా ఉండగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు, ఆక్రమణలు చేయడంతోపాటు సెల్లార్ వంటి నిర్మాణాలు చేపట్టినవారి గురించి పట్టించుకోకుండా రోడ్డుపై చిన్నచిన్న వ్యాపారాలు చేస్తున్న తమపై మున్సిపల్ అధికారులు ప్రతాపం చూపడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇదిలాఉండగా వారం నుంచి ఆక్రమణలో ఉన్న వారందరూ తొలగించుకోవాలని ముందస్తు సమాచారం ఇచ్చామని, ఎవరూ పట్టించుకోక పోవడంతోనేమున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు.

దుకాణాల తొలగింపును అడ్డుకుంటున్న చిరువ్యాపారులు

# ఎట్టకేలకు..

- నేటి నుంచి డిగ్రీ వార్షిక పరీక్షలు
- రీయింబర్స్‌మెంట్‌కు సానుకూల స్పందన
- నిర్వహణకు ఒప్పుకొన్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు

పాలమూరు యూనివర్సిటీ ప్రధాన ద్వారం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 14: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు సానుకూల స్పందన రావడంతో వాయిదా పడుతూ వచ్చిన డిగ్రీ వార్షిక పరీక్షలు ఎట్టకేలకు ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. పాలమూరు యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి యూనివర్సిటీ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం యూజీ (డిగ్రీ) పరీక్షలు కొనసాగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల పరిధిలో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరీక్షలను బహిష్కరించి ఆందోళన చేస్తున్న విషయం విదితమే. ముఖ్యమంత్రి, ఉన్నత విద్యా మండలి, ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు సానుకూల స్పందన రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షలకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఇందులో భాగంగా పీయూ విడుదల చేసిన రీ షెడ్యూల్ ప్రకారంపరీక్షలు ప్రారంభం కానున్నాయి.

**నేటినుంచి పరీక్షలు ప్రారంభం**

పాలమూరు యూనివర్సిటీ ఇప్పటికే విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 15నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అయితే విద్యార్థులు గతంలో తీసుకున్న పాత హాల్ టికెట్‌తో వచ్చినా పరీక్షలకు అనుమతిస్తారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ, బీఏ(ఎల్) (సీబీసీఎస్) పరీక్షల నిర్వహణకు సంబంధించి రీషెడ్యూల్‌కు అనుగుణంగా పరీక్షలు కొనసాగుతాయి. ఇందులో ఎటువంటి సందేహం లేదు. యూజీ 2, 4, 6వ సెమిస్టర్స్ (రెగ్యూలర్, బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్)తో పాటు సెమిస్టర్ -5 (బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్) థియరీ పరీక్షలు, ఫోర్త్ ఇయర్ ఇంటిగ్రేటెడ్ బీఈడీ(బీఎస్సీ బీఈడీ అండ్ బీఏ, బీఈడీ) 2, 4, 6వ సెమిస్టర్ (రెగ్యూలర్, బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్) థియరీ పరీక్షలు 15నుంచి టైంటేబుల్‌కు అనుగుణంగా కొనసాగుతాయి. ఈ పరీక్షల నిర్వహణకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా 47 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణపై ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లతో పీయూ పరీక్షల నిర్వహణ అధికారి ప్రవీణ సమావేశం ఏర్పాటు చేసి పరీక్షల నిర్వహణను వివరించారు. పరీక్షల నిర్వహణలో ఏమైనా సమస్యలుంటే యూనివర్సిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా..

ప్రైవేట్ అండ్ డిగ్రీ కళాశాలలకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్‌ను విడుదల చేయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి ఇచ్చిన హామీ మేరకు విద్యార్థుల భవిష్యత్, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని పరీక్షల నిర్వహణకు అంగీకరించాం. ఇప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయి కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను త్వరగా విడుదల చేసి ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు ఆర్థిక భరోసా కల్పించాలి.

**– జహీర్ అక్తర్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, పీయూ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్**

## రీషెడ్యూల్‌కు అనుగుణంగా..

విద్యార్థులు గతంలో పొందిన హాల్‌టికెట్లు లేదా కొత్తగా హాల్ టికెట్లు తీసుకుని పరీక్షలకు హాజరుకావచ్చు. కళాశాల ఐడీకార్డుతోపాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఐడీ ప్రూఫ్ వెంట తీసుకురావాలి. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష హాల్‌లోకి అనుమతించకూడదు. నిర్దేశిత సమయానికంటే ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి.

**– ప్రవీణ, పరీక్షల నిర్వహణ అధికారిణి, పీయూ**

# జోరుగా ఫిల్టర్ ఇసుక

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- సొమ్ము చేసుకుంటున్న ఇసుక మాఫియా


వెంకటాయపల్లిలో ఫిల్టర్ ఇసుక తయారు చేసే ప్రదేశం

దేవరకద్ర, మే 14: మండలంలోని వెంకటయ్యపల్లి సమీపంలో వాగులో ఫిల్టర్ ఇసుక దందా జోరుగా కొనసాగుతున్నది. ఈ విషయమై గ్రామస్తులు రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేస్తే ఫిల్టర్ కేంద్రంపై దాడులు చేయగా.. నామమాత్రంగా ఇసుక మాఫియా బంద్ చేసి తిరిగి యథావిధిగా ముమ్మరంగా ఇసుకను ఫిల్టర్ చేస్తున్నారు. రాత్రి 10గంటల తర్వాత నుంచి తెలవారుజాము వరకు ఫిల్టర్ ఇసుక తయారు చేసి మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాలకు ట్రాక్టర్‌కు రూ.4వేల చొప్పున, టిప్పర్‌కు రూ.25వేల నుంచి 30వేలకు విక్రయిస్తున్నారు. గతంలో ఇసుక మాఫియా గ్రామానికి చెందిన రైతు పొలంలో ఉన్న ఈత చెట్లకు నిప్పంటించి దగ్ధం చేశారు. ప్రస్తుతం ఇసుక మాఫియా ఇసుక పొలాలను కొనుగోలు చేసి ఫిల్టర్ ఇసుక తయారు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతిరోజూ 10 ట్రాక్టర్లు, 5 జేసీబీల సహాయంతో ఫిల్టర్ ఇసుక తయారు చేస్తున్నారు. అధికారులు స్పందించి ఫిల్టర్ ఇసుక రవాణాను నివారించాలని కోరుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం**

వెంకటాయపల్లి సమీపంలో ఉన్న ఇసుక ఫిల్టర్ కేంద్రం వద్ద గతంలో చర్యలు తీసుకున్నాం. ప్రస్తుతం మరోసారి దాడిచేసి ఫిల్టర్ ఇసుక తయారీ కాకుండా చర్యలు తీసుకుంటాం. ఫిల్టర్ ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లు, జేసీబీలను సీజ్ చేస్తాం.

**– కృష్ణయ్య తాసీల్దార్, దేవరకద్ర**

# 'అకాల' నష్టం

- పెద్దమందడిలో భారీ వర్షం
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

భారీ వర్షాలకు కల్లంలో తడిసిన ధాన్యం

పెద్దమందడి, మే 14: మండల కేంద్రం తోపాటు మండలంలోని వీరాయపల్లి, చిన్నమందడి, దొడగుంటపల్లి, పామిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. భారీ వర్షం కురవడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు కోసం ఉంచిన వరిధాన్యం తడిసిపోయింది. టార్పాలిన్ కవర్లు కప్పినప్పటికీ ధాన్యం తడిసిపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలును త్వరగా చేపడితే ఈ పరిస్థితి వచ్చేదికాదని రైతులు వాపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడుతున్నప్పటికీ ధాన్యం కొనుగోలు నత్తనడకన సాగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# జూన్ 14న జాతీయ లోక్ అదాలత్

మహబూబ్‌నగర్, మే 14: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జూన్ 14న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పాపిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టులో ఆయన విలేకరులతో మాట్లాడారు. లీగల్ సర్వీసెస్ ఆదేశాల మేరకు మెగా లోక్ అదాలత్ కార్యక్రమం ఉంటుందన్నారు. మొత్తం 8బెంచీలను లోక్ అదాలత్ కేసులను పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రాజీ మార్గమే రాజ మార్గమని.. అందరూ కక్షిదారులు తమ కేసులను రాజీ చేసుకోవాలని కోరారు. మోటర్ వెహికిల్ యాక్సిడెంట్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు కేసులు, ఇన్సూరెన్స్ కంపెనీ స్టాండింగ్ కౌన్సిల్‌తో జాతీయ లోక్